# నాలుగు నాలుగులు : ఒకటి

టి. కమల

"అమ్మా! ఇల్లు అమ్మేద్దామనుకుంటున్నాను" అన్న రవి మాటలకు జానకమ్మ ఉలిక్కిపడింది.

"ఏమిటీ, బాబూ, అన్నావు?" అంది నమ్మలేనట్లు రవి తల్లి జానకమ్మ.

"అవు నమ్మా! ఇల్లు అమ్మేసి చెల్లి పెళ్ళి చేద్దామనుకుంటున్నాము. ఇది నా ఒక్కడి అభిప్రాయం కాదమ్మా! అన్నదమ్ములం అందరం అనుకుని ఈ నిర్ణయానికి వచ్చాము" అని దృఢనిశ్చయంతో సమాధానం చెబుతున్న కొడుకులను నిర్ఘాంతపోయి తేరిపార చూసింది జానకమ్మ.

జానకమ్మకు నలుగురు కొడుకులు, ముగ్గురు ఆడపిల్లలు. ఆఖరు సంతానం ఆడపిల్ల పుట్టడం, భర్త ప్రమాదంలో చనిపోవడం-రెండూ ఒకేసారి జరిగాయి. ఏడుగురు సంతానానికి తల్లి అయిన జానకమ్మ వయసు భర్త పోయేనాటికి ముప్ఫయి సంవత్సరాలు నిండలేదు. ఆ కాలంలో పది సంవత్సరాలకు పెళ్ళి జరిపించాల్సిందే. పదిహేను, పదహారు సంవత్సరాల కంతా పిల్లతల్లి కావాల్సిందే. ఆ రీతిలోనే జానకి వివాహం పదో యేట జరిగింది. ముప్పై సంవత్సరాలు వచ్చేసరికి అన్నీ అయిపోయాయి. ప్రాణప్రదంగా ప్రేమించే భర్త మరణం జానకికి మాయని గాయమైంది. 'ఇంతమందిని ఎలా పోషించాలి?' అని బెదిరిపోలేదు. గుండె నిబ్బరంతో ఇంటిని గుట్టుగా నడిపించు కొచ్చింది.

"అమ్మా!" అన్న పిలుపులో గతం నుంచి తేరుకొని, "నాయనా రవీ! చెల్లి పెళ్ళి కోసం ఇల్లు అమ్మా లంటావా?" అని మెల్లగా అడిగింది.

"అమ్మకుంటే చెల్లి పెళ్ళికి డబ్బు ఎక్కడి నుంచి వస్తుంది?" ఎదురు ప్రశ్న వేశాడు రవి.

జానకమ్మ కాస్త ఆలోచించి- "నలుగురు అన్నదమ్ములూ కలిసి ఈ పెళ్ళి జరిపిస్తే..."

మాట పూర్తవకముందే గయ్‌మని లేచాడు రెండో కొడుకు రామకృష్ణ. "అందరూ కలిసి అప్పుచేసి చావండి అంటావు, అదే కదూ నీ ఉద్దేశం? మమ్మల్ని ఇలా సుఖంగా బ్రతకనీ వన్న మాట!"

జానకమ్మ కళ్ళలో నీళ్ళు చిప్పిల్లాయి. మాట గొంతుకలోనే ఉండిపోయింది. తన ఉద్దేశం అది కాదు. నలుగురు అన్నదమ్ములు మంచి ఉద్యోగాల్లో ఉన్నారు. ఇంటిని తాకట్టు పెట్టి డబ్బు తెచ్చి పెళ్ళి జరిపించినా, నిదానంగా అప్పు తీర్చుకొన్నా కొంత కాలానికి ఇల్లు మిగులుతుంది. భర్త మరణానంతరం తన ఒంటిమీద బోలెడు నగలు ఉంటే వాటిని అమ్మేసి పిల్లల చదువులకు ఖర్చుపెట్టింది. కొంత పొలం ఉంటే అందులో సగం అమ్మేసి ఇద్ద రమ్మాయిల పెళ్ళిళ్ళు జరిపించింది. తన భర్తకు ప్రాణప్రదమైన ఈ ఇంటిని అమ్మకూడదన్న పట్టుదలతో పిల్లల చదువులకూ, ఆడపిల్లల పెళ్ళిళ్ళకూ డబ్బు సరిపోకపోతే ఇల్లు అమ్మాలన్న ధ్యాసే రానివ్వలేదు. డబ్బు వడ్డీలకు తెచ్చేది. భర్త కోరిక తీర్చాలి. ఇల్లు నిలుపుకోవాలి అన్న తపనే జానకమ్మకు ఉండేది. ఇంటిని అమ్ముదామని అంటున్న కొడుకుల మాట పెడచెవిన పెట్టింది. అయినా తాను ఉన్నంతవరకే ఈ ఇంటిమీద తపన. తన అనంతరం ఇల్లు ఎలాగూ అమ్మేస్తారు. తాను ఉన్నంతవరకూ ఇల్లు ఉండాలన్న తన కోరిక తీరని కోరికే అవుతుందేమో అన్న భయం కలిగింది.

"అమ్మా! ఇల్లు అమ్మితే నీకు ఆ ఇంటి అద్దె పోతుందనే కదూ నీ బాధ! అద్దె డబ్బులు నీకు నేను ఇస్తానమ్మా! ప్రతి నెలా నువ్వు ఎక్కడ ఉంటే అక్కడకు పంపిస్తాను. సరేనా?" అన్నాడు మూడవ కొడుకు జయకృష్ణ.

జయకృష్ణ మాటలకు నవ్వాలో, ఏడ్వాలో అర్థం కాకుండా పోయింది ఆమెకు.

జానకమ్మకు కొడుకు లెవ్వరూ డబ్బు ఇవ్వరు. డబ్బు అవసరం ముసలివాళ్ళకు ఏముంటుందని వాళ్ళ అభిప్రాయం. ఆమె నలుగురు కొడుకుల్లో ఏ కొడుకు ఇంట్లో ఉన్నా ఆ ఇంటి అద్దె డబ్బు తనకు వచ్చేటట్లుగా పుత్రరత్నాలు ఏర్పాటు చేశారు. అదే తనకు ఆధారం. పెళ్ళికాని అమ్మాయికి చీర కొనాలన్నా పెళ్ళయిన ఇద్ద రమ్మాయిలూ పండుగకు వస్తే ఓ చీర పెట్టడానికి ఆ డబ్బే వాడుకునేది. అంతేగాని ఏ కొడుకూ తన సంపాదనలోంచి 'ఈ వందా నీ దగ్గర ఉంచుకోమ్మా!' అన్న పాపాన పోలేదు.

పిల్లల్ని పెద్ద పెద్ద చదువులు చదివిస్తే తన కష్టాలు గట్టెక్కుతా యనుకుంది.

"జానకీ! ఇది నీ శక్తికి మించిన పని. పిల్లల్ని ఇంజనీరింగ్, డాక్టరు చదివించా లనుకోవడం, ఆశపడడం అవివేకం" అని హెచ్చరించినవా ళ్ళెవరి మాటా వినలేదు. పట్టు బట్టింది. కష్టపడింది. చిరుగు బట్టలతో కాలక్షేపం చేసింది. తన ఇంటిని అద్దెకు ఇచ్చేసి, చిన్న ఇంట్లో కాలక్షేపం చేసింది. కొంత పొలం ఉండేది. పంట వచ్చినప్పుడు మంచి రకం బియ్యం వస్తే వాటిని అమ్మేసి చౌకరకం బియ్యం తెచ్చుకునేది. అప్పులు చేసింది. వడ్డీలు కట్టింది. పిల్లల చదువులు నిరాటంకంగా సాగేట్లు చేసింది. అందరి ముందూ గర్వంగా తల ఎత్తి నిలబడగలిగింది. విధవరాలు వెధవరాలు గాదని, స్త్రీ శక్తి స్వరూపిణి, సాధించగలదు, శోధించగలదు, ధైర్యంగా కష్టాల్ని, నష్టాల్ని భరించగలదు - అని నిరూపించుకున్న తల్లి జానకమ్మ!

కా...నీ, ఈనాడు ఆఖరి అమ్మాయి పెళ్ళికి ఎదిగేసరికి ఒక్క ఇల్లు తప్ప సెంటూ భూమి గానీ, ఒక గ్రాము బంగారం గానీ మిగలలేదు.

"అసలు ఇల్లు అమ్మితే నీ కొచ్చిన నష్ట మేమిటి? అన్నయ్య నెలనెలా నీకు డబ్బు పంపిస్తానంటున్నాడు కదా? రానురాను నీకు డబ్బు పిచ్చి ఎక్కువైంది" అని అన్నాడు ఆఖరి కొడుకు హరికృష్ణ చిరాగ్గా.

"బాబూ కృష్ణా! నాకు నష్టం అన్నది లేదురా! మీ నాన్న గతించిన నాడే నేను నా జీవితాన్నే నష్టపోయాను. ఇక నష్టం అన్న పదానికి నాకు అర్థం తెలియదురా. డబ్బు పిచ్చి నాకు లేదు. భవిష్యత్తులో ఐదు లక్షల విలువ చేసే ఇల్లు ఇప్పుడు చెల్లి పెళ్ళి కోసం అమ్మితే నలుగురూ నష్టపోతారురా! మీ నలుగురూ కలిసి చెల్లి పెళ్ళి జరిపిస్తే ఈ ఇల్లు మీకు మిగులుతుంది. నా గురించి అని మాత్రం అనుకోవద్దు. జీవన సమరంలో పోరాడి అలసిపోయిన దాన్ని, చివరి దశకు చేరుకున్నదాన్ని. నా కోసం అని మాత్రం అనుకోవద్దు. మీ చదువులకు గాను ఆనాడు ఇల్లు అమ్మినా అ దో న్యాయంగా ఉండేది. అలాంటిది ఈనాడు పెళ్ళి ఖర్చులకు గాను ఇల్లు అమ్మడం న్యాయం కాదు బాబూ! అదీకాకుండా ఈ ఇల్లు నిలుపుకోవాలని మీ నాన్న ఎన్నెన్నో కష్టాలు పడ్డారు.

"మీ తాతగారు ఈ ఇంటిమీద బోలెడు అప్పు చేస్తే పెద్దల ఆస్తిని నిలుపుకోవాలని తన సరదాలను చంపుకున్నారు. చిరుగుల చొక్కాలు తొడుక్కున్నారు, పచ్చడి మెతుకులు తిని కాలక్షేపం చేశారు. అప్పు చేశారు. వడ్డీలకు వడ్డీలు కట్టారు. ఎంత కష్టపడో ఈ ఇంటిని నిలుపుకున్నారు. 'జానకీ... ఇంటిమీద అప్పు నేటితో తీరిపోయింది. ఇంక హాయిగా ఉండొచ్చు' అని ఆనందించిన మీ నాన్న మరుసటి రోజే కన్ను మూశారు. ఆయనకు ఆ ఇంటిమీద ఎంత ప్రేమ ఉండేదో నాకు తెలుసు. అందుకే ఎంత కష్టపడ్డా వర్యాలే

'ఓ తల్లి పదిమంది పిల్లల్ని పోషించగలుగుతుంది గానీ, పదిమందీ కలిసి ఒక్క మనిషికి సహాయం చేయడానికి ప్రయత్నించరు'- అదే విచిత్రం!

దనుకుని మీ చదువులకు నగలు, భూములు అమ్మానే గాని, ఇంటిని మాత్రం అమ్మడానికి సాహసించలేదు. కానీ ఈనాడు పెళ్ళి ఖర్చులకు గాను ఇంత పెద్ద ఇంటిని అమ్మడం అనవసరం అనిపిస్తోంది బాబూ !"

"నేను చెప్ప లేదుటండీ- ఇల్లు అమ్మడానికి ఆవిడ ఒప్పుకోరనీ! నా మాట విన్నారు కాదు. ఛార్జీలు దండుగ చేసుకుని ఇంత దూరం వచ్చాం. ఇక బయలుదేరండి. రాత్రికే వెళ్ళిపోదాం" అంటూ విసవిసా గదిలోకి వెళ్ళిపోయింది చిన్నకోడలు.

ప్రతి సంవత్సరం నలుగురు కొడుకులూ కలిసి



తాను ఉన్నచోట. తండ్రి తద్దినం పెడతారు. తాను ఈసారి పెద్దకొడుకు ఇంట్లో ఉంది కనుక మిగిలిన ముగ్గురూ ఇక్కడికి వచ్చారు. నిన్నటి రోజున ఆ తతంగం ముగిసిపోయింది. వచ్చిన ముగ్గురు కొడుకులూ, కోడళ్ళూ రేపు వెళ్ళిపోతారు. నాలుగైదు సంవత్సరాలుగా ఇలా ఏడాదికి ఒకసారి కలుసుకున్నా ఇంటిని అమ్మేయమని అందరూ పట్టుబడుతూనే ఉన్నారు. తాను నిరాకరిస్తూనే వచ్చింది.

కోడలు అన్న మాటలకు జానకమ్మ మనస్సు చివుక్కుమంది. 'అయితే ప్రతి సంవత్సరం వచ్చేది భక్తి శ్రద్ధలతో ఆయన్ని తలచుకోవడానికి కాదన్నమాట! ఆస్తి అమ్మకాని కన్నమాట వీరందరూ వచ్చేది!' అనుకుని బాధ పడింది.

రెండవ కోడలు "త్రేతాయుగం నాటి ఇల్లు. ఏం బావుందని? అమ్మితే పోలా? ఉండేదేమో మా దగ్గర. అద్దె డబ్బులేమో ఆవిడ దగ్గర. అత్తగారు తెలివైన వారండీ. ఆవిడ తెలివితేటలు మా కెక్కడివి?" అంటూ వెళ్ళిపోయింది.

"అత్తయ్యా! మీకు ఇల్లు కావాలో, మీ అమ్మాయికి పెళ్ళి కావాలో తేల్చుకోండి. అప్పు చేసి మాత్రం పెళ్ళి చేసేది లేదు" అని కచ్చితంగా చెప్పేసి మూడో కోడలు వెళ్ళిపోయింది.

ఏ కోడలి మాటకూ ఏ కొడుకూ సమాధానం చెప్పకపోయేసరికి జానకమ్మ దుఃఖంతో కుమిలిపోయింది.

ఆడపిల్లలకు ఈ కాలంలో పెళ్ళి కుదరడమే చాలా కష్టం. అలాంటిది మంచి సంబంధం కుదిరింది. ఇది జరగకుంటే మళ్ళీ మరో సంబంధం కుదురుతుందన్న నమ్మకం లేదు. అయినా ఈ సంబంధం కుదిరినా, ఇల్లు అమ్మి పెళ్ళి చేయవలసిందే! దీనికి తిరుగు లేదని గ్రహించగలిగింది జానకమ్మ. ఓ తల్లి పదిమంది పిల్లల్ని పోషించగలుగుతుంది గానీ, పదిమందీ కలసి ఒక్క మనిషికి సహాయం చెయ్యడానికి ఒప్పుకోరు. 'భగవంతుడా! తల్లి మనస్సుకు ఇంతటి మెత్తటి స్వభావాన్ని ఇచ్చి పిల్లల హృదయాల నెందు కింత కఠినంగా మార్చావు? ఇది నీ సృష్టి లోపమా? మా కర్మ ఫలమా? మా ప్రాప్తం అంటావా? లేక మా మా ప్రారబ్దం అంటావా తండ్రీ!' అంటూ ఆమె మనసులోనే దుఃఖించింది.

భర్తను గుర్తు చేసుకుంటూ 'ఏమండీ! ఈ ఇంటిని నిలుపుకోవడానికి మీరూ, నేనూ ఎంతో శ్రమించాము. ఇంటిని నాకు అప్పగించి మీరు వెళ్ళిపోయారు. మీ తరువాత కూడా ఎన్ని ఇబ్బందులు వచ్చినా, అప్పులు చేశానే గానీ ఇంటిని అమ్మలేదండీ! ప్రయోజకులైన కొడుకులు ఉండి కూడా ప్రయోజనం లేకుండా పోయారండీ! ఆఖరి అమ్మాయి పెళ్ళి కూడా ఈ ఇల్లు అమ్మి చేసేస్తానండీ! మీరు పెట్టిన ఆస్తిపాస్తులతోనే అందరినీ ఒక ఒడ్డుకు చేర్చినట్లు అవుతుంది. ఎవరి దయాధర్మాల మీదా పెళ్ళి జరగ నవసరం లేదండీ! దర్జాగా ఇల్లు అమ్మి పెళ్ళి వైభవంగా జరిపిస్తాను!' అని జానకమ్మ మనసులో దృఢనిశ్చయం చేసుకుని తన అంగీకారాన్ని తెలియజేసింది.

కొడుకులూ, కోడళ్ళూ ఆనందంతో కలిసి సినిమాకు బయలుదేరారు. జానకమ్మ మౌనంగా ఓ చోట కూర్చునుంది. "సినిమాకు మీరూ రండి అత్తయ్యగారూ!" అని ఆప్యాయంగా కోడళ్ళు పిలిచారు.

'నా బ్రతుకే ఓ సినిమాలా ఉంది. ఇంక వేరే సినిమా ఎందుకులే?' అనుకుని "ఒంట్లో బాగా లేదమ్మా! మీరు వెళ్ళిరండి!" అని చెప్పింది.

★ ★ ★

"అమ్మా! చెల్లి పెళ్ళికి డబ్బు ఎంత కావలసి ఉంటుం దంటావు?" అని అడిగిన ప్రశ్నకు జానకమ్మ జవాబు చెప్పే లోపల చిన్నకొడుకు కలుగజేసుకుని "బాగుం దన్నయ్యా, నీ ప్రశ్న! ఖర్చుకు అంతు ఎక్కడిది? అందునా పెళ్ళికి ఎంతయినా ఖర్చు చేయవచ్చు. ఏదో ఇంత. అనుకొని మనం సరిపెట్టాలి కాని!" అన్నాడు.

జానకమ్మ ఏమీ మాట్లాడలేదు. ఇద్దరు కొడుకుల సంభాషణ వింటూ కూర్చుంది. కాసేయ్యాక "బాబూ రవీ! ఇల్లు అమ్మితే ఎంత డబ్బు వస్తుం దంటావు?" అని అడిగింది.

"ఎంత వస్తే ఏం? అంతా ఖర్చు చెయ్యాలా? ఓ హద్దు అంటూ లేదా?" అన్నాడు రామకృష్ణ.

జానకమ్మకు సహనం చచ్చిపోయింది. కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి. గట్టిగా "నేను అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పమంటున్నాను. ఇల్లు అమ్మితే డబ్బు ఎంత వస్తుందీ అని అడుగుతున్నాను."

తమ పాతికేళ్ళ జీవితంలో ఇంత గట్టిగా తల్లి మాట్లాడింది ఏ కొడుకూ చూడలేదు. అందరూ తల్లిని తేరిపార చూశారు.

గట్టిగా అడిగేసరికి పెద్దాడు- "రెండు లక్షలు రావచ్చు అనుకుంటాను!" అన్నాడు.

"చెల్లి పెళ్ళికి నా అంచనా ప్రకారం నలభై వేల లోపునే అవుతుం దనుకుంటాను. కట్న కానుకల ప్రసక్తి లేదు కనుక, జాగ్రత్తగా జరిపితే ముప్పై వేలల్లోనే అయిపోతుంది. లేదా కచ్చితంగా నలభై వేలల్లో అయిపోతుంది."

"నలభై వేలు పోగా మిగిలిన డబ్బు" అని జానకమ్మ చెప్పేలోపల మూడవ కొడుకు గబుక్కున- "నాలుగు నాలుగుల పదహారు" అన్నాడు.

జానకమ్మకు సహనం చచ్చిపోయింది. తిక్కరేగింది. ఎదిగిన కొడుకులు అన్న మాట కూడా మరచిపోయింది. "బాబూ! నాలుగు నాలుగుల పదహారు, సరిగ్గా చెప్పావు. ఏది మరచినా ఎక్కాలు మాత్రం మర్చిపోలేదు. ఇంజనీరు చదివినందుకు ఎక్కాలు, . లెక్కలు బాగా వంటబట్టాయి. కాంట్రాక్టు విషయాలలో లెక్కలు సరిగ్గా చూసుకుంటావు అనుకుంటాను. నాలుగవ ఎక్కం చెప్పిన వాడికి ఒకటో ఎక్కం రాకమానదు అనుకుంటాను? ఒక ఒకటి ఒకటి [1×1] అంటే – నీకు అర్థం అయిం దనుకుంటాను!"

ఇద్దరి సంభాషణకూ అర్థం తెలియక మిగిలిన కోడళ్ళూ, కొడుకులూ తెల్లబోయారు. ఒకరి ముఖాలు ఒకరు చూసుకొన్నారు. జానకమ్మ అంతరార్థాన్ని గ్రహించిన హరికృష్ణ మాత్రం తల దించుకున్నాడు.

"ఏమిటీ! మీరంతా అలా నిలబడిపోయారు? నాలుగు నాలుగుల పదహారు అంటే రెండు లక్షలల్లో నలభై వేలు పెళ్ళికి ఖర్చు అయితే మిగిలింది లక్షా అరవై వేలన్న మాట. మీ నలుగురికీ మిగిలిన డబ్బు పంచి ఇస్తే ఒక్కొక్కరికీ నలభై వేలు వస్తుం దన్నమాట!" నలభై అనేసరికి తృప్తిగా కోడళ్ళు తల ఊపుతూ బుద్ధిగా వింటున్నారు.

అంతేకదా మరి అన్నట్లు.

"పావం హరికృష్ణ ఒక్కడే కాదు, మీ రందరూ కూడా నాలుగో ఎక్కాన్ని మననులోనే వల్లె వేనుకుని ఉంటారు. నేను కూడా మీలాగే ఊహించుకుని, నాలుగో ఎక్కాన్ని గుర్తు చేనుకున్నా. నా కూతురి పెళ్ళికి నలుగురూ కలిసి నాలుగు వదులు వేనుకుని పెళ్ళి చెయ్యకపోతా రా అనుకునేదాన్ని. అష్టకష్టాలూ వడి పెంచి పెద్దచేసి శక్తికి మించిన చదువులు చదివించానని ఆమాత్రం కొడుకులు నన్ను ఆదుకోకపోతా రా అని అనుకున్నా. నా అంచనా తప్పయింది. అలాగే మీ అంచనా కూడా తప్పయింది. అందరూ బాగా వినండి. ఇల్లు అమ్మిన డబ్బులో అమ్మాయి పెళ్ళి జరిపించగా మిగిలిన డబ్బు నా పేర బాంకులో వెయ్యాలి. ఇందులో మీకంటూ వాటా ఉండదు. అలా అయితేనే నేను ఇంటిని అమ్మడానికి నంతకం చేస్తాను."

"అయితే ఈ ఇల్లు అమ్మినందువల్ల మనకు ప్రయోజనం ఏమిటీ?" అంటూ ఓ కోడలు దీర్ఘం తీసింది.

"మీ ప్రయోజనాలకూ, మీ విలాసాలకూ నేను ఈ ఇంటిని అమ్మడం లేదు. నా కన్నబిడ్డకు పెళ్ళి చెయాల్సిన బాధ్యత నాపైన ఉన్నందుకు, నా బిడ్డ భవిష్యత్తు కోసం ఇల్లు- నా ఇల్లు అమ్ముకుంటున్నానన్న నంగతి గుర్తుంచుకో!"

వల్లెత్తు మాట అనని అత్తగారి నోటి నుంచి ఇన్ని మాటలు వినేసరికి నోట మాట రాక అలా నిలబడిపోయింది ఆ కోడలు.

"నేను చెప్పలేదూ? అమ్మకు ఈమధ్య డబ్బు పిచ్చి ఎక్కువైపోయిందనీ!" అన్న కొడుకు మాటకు-

"నోర్మూయ్! అనవసరంగా మాట్లాడి, నీ పెళ్ళాం ముందు చులకన అయిపోకు. నాకు డబ్బు పిచ్చి ఉండి ఉంటే వేలకు వేలు పోసి మిమ్మల్ని ఇంతింత పెద్ద చదువులు చదివించేదాన్నే కాదురా! ఏ బి.ఏ.నో చదివించి మీ కర్మాన మిమ్మల్ని వదలేసి ఉంటే ఈనా డీ వరిస్థితి వచ్చి ఉండేది కాదు.

"నా కీ డబ్బు పిచ్చి ఉండి ఉంటే కట్న కానుకలు ఇచ్చే తాహతు గల కోడళ్ళకు కానీ కట్నం పుచ్చుకోకుండా మీచేత తాళి కట్టించేదాన్ని కాదురా! డబ్బు పిచ్చి నాకు కాదురా! మీకు ఉంది. అందుకే చెల్లి పెళ్ళి ఏదో అయిం దనిపించేసి మిగిలిన డబ్బు మీరు వంచుకుందా మనుకున్న మీ కుందిరా డబ్బు పిచ్చి!

"వయను మీరిన వాళ్ళకు డబ్బ పిచ్చి ఉండదు గానీ, డబ్బు అవనరం మాత్రం తప్పక ఉంటుందిరా! నా కళ్ళజోడు విరిగిపోయి ఏ కాలమైంది? ఎవడైనా అడిగాడా- కళ్ళజోడు ఎందుకు వేనుకోవడం లేదని. నేనేం దాన్ని దాచలేదు- అల్మారాలో పడి ఉంది. అందరూ చూస్తునే ఉన్నారు. మరి ఎవరైనా అడగడానికి సాహసించారా? లేదే! అంతటి విశాల హృదయం ఎవరికి ఉంది? కళ్ళజోడు కొనాలంటే డబ్బు ఖర్చు అవుతుంది. ఆ ఖర్చు దండుగ ఎందుకూ? ఆ డబ్బు దాచుకుంటే పోలా అనే మీకు ఉందిరా డబ్బు పిచ్చి!

"బాబూ! మీ నాన్న అంటే అర్థాంతరంగా మరణించారు గానీ, ఒక ప్రభుత్వోద్యోగి పాతిక నంవత్సరాలు ఉద్యోగం చేసి రిటైర్ అయితే అతను చేసిన సేవలకు గుర్తింపుగా, కృతజ్ఞతా భావంతో అతను బతికినంత కాలం పింఛను మంజూరు చేస్తుంది. ఆ తరువాత కూడా అతని అనంతరం అతని భార్యకు ఆ పింఛను ఇస్తారు. ఎందుకో తెలుసా? వృద్ధాప్యంలో డబ్బుకు ఇబ్బంది వడకుండా ఉండటానికి.

"ఈనాడు తల్లిదండ్రులు వృద్ధాప్యంలో పిడికెడు మెతుకులు తింటున్నారంటే ఆ దయ ప్రభుత్వానిదే కానీ, మీది కాదురా! మీ దయా దాక్షిణ్యాల మీద బ్రతికే కర్మను తప్పించిన ప్రభుత్వానికి ప్రతి తల్లీ, తండ్రీ జోహార్లు అర్పించాల్సిందే! విశ్వానం, నీతి, న్యాయం, ధర్మం, దయ వీటికి అర్థం ప్రభుత్వానికి తెలును కానీ, మీకు తెలియ దనుకుంటాను.


"ఇన్నాళ్ళుగా నా పింఛను డబ్బు మీకే ఇస్తూ వచ్చాను. ఒక్కసారి అయినా మీరు వద్దన్నారా? మీ నలుగురిలో ఎవరి దగ్గర ఉంటే వాళ్ళకే ఇస్తూ వచ్చాను. పైగా అద్దె డబ్బు ఇవ్వడం లేదని కోడళ్ళు నణుగుడు. ఒక్కనాడైనా పెళ్ళయిన ఇద్దరు చెల్లెళ్ళకీ, పెళ్ళి కాని ఈ పిల్లకీ జాకెట్టు ముక్కయినా కొన్నారా? ఇవన్నీ నా అద్దె డబ్బుతోనే చూనుకుంటూ వచ్చాను.

"నాలుగు రోజుల బట్టీ రాత్రిళ్ళు అన్నం అరగడం లేదు. రెండు పళ్ళు తిని, పాలు తాగి వడుకుంటే నరిపోతుం దనుకుని నోరు విడిచి కోడలిని అడిగా. దానికి నీ పెళ్ళాం ఏం నమాధానం చెప్పిందో తెలుసా? 'రెండు పూటలా అన్నం తినడమే ఈ రోజుల్లో మహా అదృష్టంగా భావిస్తున్నారు. అలాంటిది ఈవిడ గారికి పళ్ళూ పాలూ కావాలట!' అని వ్యంగ్యంగా వక్కింటి ఇల్లాలితో అన్నదో, లేదో అడుగురా!"

జానకమ్మ గొంతు ఆర్ద్రమైంది.

"ఒరేయ్! వృద్ధాప్యంలో కొడుకులు చేయూత నిస్తారని, వారి నీడలో మాలాంటి వాళ్ళ బ్రతుకులు హాయిగా వెళ్ళిపోతాయనీ నమ్మకం ఒకప్పుడు ఉండేది. ఇప్పుడు కాలం మారింది. ప్రేమాభిమానాలకు తావు లేదు. ఏ కొడుకూ దయగా చూడడు. చూడలేదు. ఈనాడు ఇల్లంటూ అమ్మేసి వచ్చిన డబ్బు మీరు వంచేనుకుని, నన్ను బయటికి గెంటేసినా ఆశ్చర్యపోనక్కర్లేదు. అప్పుడు నన్ను ఎవరు ఆదరిస్తారు?

"రేప్పు నాకు రోగం రావచ్చు. మందులూ మాకులూ వాడాల్సి రావచ్చు. అప్పుడు ఎవరు నన్ను చూస్తారు? అందుకే ఓ నిశ్చయానికి వచ్చాను. ఇల్లు అమ్మేసి వచ్చిన డబ్బులో అమ్మాయి పెళ్ళి జరిపించి, మిగిలిన మొత్తం నా పేర బాంకులో వేనుకో దలిచాను. బహుశః పిల్ల పెళ్ళి చేసి యాత్రల పేరు చెప్పి మీకు దూరంగా ఏ కాశీకో వెళ్ళిపోతాను!" అంటూ కళ్ళు తుడుచుకుని వీధి చివరన ఉన్న ఆలయానికి బయలుదేరింది జానకమ్మ. ★



## సముద్ర తరంగాల చమత్కారం

*సముద్ర తరంగాలు ఎక్కువగా ప్రమోదాన్ని అప్పుడప్పుడు ప్రమాదాలను సృష్టిస్తుంటాయి. ఫ్రాన్సు నముద్ర తీరం లోని 'మాంట్ సెయింట్ మిచెల్', నముద్ర తరంగాల చమత్కారానికి ఒక చక్కని ఉదాహరణ. నముద్ర తరంగాలు దాదావు ఒక రోజులో నగ భాగం లోపలికి, మిగిలిన నగ భాగం బయటికి వస్తుంటాయి. నముద్ర తరంగాలు దూరంగా ఉన్నప్పుడు ఈ ద్వీవం 914 మీటర్ల పొడవైన నన్నని దారితో ఫ్రాన్సు భూభాగంతో కలుస్తూ ఉంటుంది. అలలు ఎక్కువగా ఉన్నప్పుడు దారి అంతా మూసుకుపోయి ఒక ద్వీవకల్పంలా కనబడుతుంది. ఈ తేడాను ఫోటోలో స్పష్టంగా చూడవచ్చు.*

వల్లాల నువమ [బలపాల]